సాక్షి
కాకినాడ
బుధవారం । 28 । ఆగస్టు । 2024




రక్షణ కల్పించావా దేవా..
రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్మించిన 'ఆది శంకర మార్గ్' రహదారికి ఎట్టకేలకు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు.

8లో



నగల వ్యాపారి ఇంట్లో చోరీ
కొవ్వూరులో కట్టా ఉషాశ్రీ అనే నగల వ్యాపారి ఇంట్లో దొంగలు చోరీకి తెగబడ్డారు. రూ.30 లక్షల విలువైన యాభై కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్, యాక్టివా స్కూటర్‌ను అపహరించుకుని పోయారు.

మిగులు జలాల విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 3,87,184 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. ఖరీఫ్ సాగు కోసం డెల్టా కాలువలకు 12,100 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

పారదర్శకంగా బదిలీలు
కలెక్టర్ షణ్మోహన్ ఆదేశం



బదిలీలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలోమాట్లాడారు. ఉద్యోగుల బదిలీలలో ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయాలని, అపోహలకు తావులేకుండా బదిలీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల వివరాలు శాఖల వారీగా సమర్పించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు పాల్గొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ బృందానికి అభినందనలు

విపత్తులు సంభవించినప్పుడు సమర్థంగా రెస్క్యూ కార్యకలాపాలు నిర్వహించేలా జిల్లాలో 20 రోజుల పాటు ఫెమెక్స్‌విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహించింది. వాటి ముగింపు సందర్భంగా మంగళవారం జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్టు మేనేజర్ ఎం.లావణ్య, ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమాండర్ మన్‌మోహన్ యాదవ్‌లు కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ బృందానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

అన్నవరం సత్యదేవ ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు



ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పత్రం అందజేస్తున్న వీసీ మురళీకృష్ణ, ఫుడ్ టెక్నాలజీ డైరెక్టర్ రమేష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదానికి ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు కల్పించింది. ఈ గుర్తింపు పత్రాన్ని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ చేతుల మీదుగా ఎంపీ కార్యాలయంలో మంగళవారం అవిష్కరించారు. ఈ సర్టిఫికెట్ జారీలో ప్రత్యేక కృషిచేసిన జేఎన్‌టీయూకే ఫుడ్‌టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ రవీంద్ర పాల్గొన్నారు.

వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించండి
కాకినాడ సిటీ: గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో 47 మందికి 17 మంది వివిధ కారణాల రీత్యా సంబంధిత శాఖ పరీక్షలు రాయలేకపోయారని రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్ల క్రితమే గ్రేడ్- 1 వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాల్సి ఉందన్నారు. ఈ పదోన్నతుల్లో కొన్ని నిబంధనలతో రాష్ట్రంలో 650 మందికి గాను దాదాపు 450 మంది శాఖ, ఇతర పరీక్షలలో ఉత్తీర్ణులు అయ్యారన్నారు. వీరిలో కొంతమందికి పరీక్షలు గతంలో సకాలంలో నిర్వహించకపోవడం, ఏపీపీఎస్సీ ఇచ్చిన సీపీటీ పరీక్షల వెలువరించిన ప్రకటనలో గ్రేడ్-1 వీఆర్వోలకు మాత్రమే ప్రమోషన్లు ఇచ్చారన్నారు. సీపీటీ టెస్ట్ పాస్ కాని వారికి, 45 ఏళ్లు దాటిన వారికి టెస్టుల నుంచి మినహాయింపు ఇచ్చి పదోన్నతులు కల్పించవచ్చని జీవో స్పష్టంగా ఉందన్నారు. అర్హులైన వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని రవీంద్రరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అనిసెట్టి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తులకు నేడే తుది గడువు
రాయవరం: జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లోని ఉపాధ్యాయులు 2024 సంవత్సరానికి ఉత్త మ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కనీసం 15 ఏళ్ల సర్వీసు ఉండాలని, క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు లేనివారు అర్హులని, దరఖాస్తులకు చివరి రోజు బుధవారమని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతి షిఫ్టు 36 గంటలు


వైద్యుల పనివేళలు దారుణం. ప్రతి షిఫ్టు 36 గంటలు. ఇటువంటి స్థితి మారాలి. పనివేళలపై సాక్షాత్తూ సుప్రీంకోర్టే విస్మయం వ్యక్తం చేసింది. ఈ 36 గంటల డ్యూటీలో కొనసాగుతూనే కోల్‌కతా వైద్య విద్యార్థిని దుర్మార్గుల దాష్టీకానికి బలైపోయింది. అయితే విధానపరంగా ఇప్పటికిప్పుడు మారే పరిస్థితి లేదని గుర్తించి సర్దుకుంటున్నాం. దేశ అత్యున్నత న్యాయస్థానం సూచనల మేరకు పనివేళల్లో మార్పులు తీసుకురావాలి. ఉన్నపళంగా తేలేకపోయినా పనిచేసే చోట వైద్యులకు కనీస భద్రత కల్పించాలని కోరుకుంటున్నాం. ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న వైద్యులకు భద్రత కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. ఈ విషయాన్ని విస్మరించడం వల్లే, పీజీ వైద్య విద్యార్థిని తన మానప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. కేవలం భద్రతా లోపం వల్ల మరెక్కడా ఇటువంటి దారుణం జరగకూడదు.

– డాక్టర్ శృతి, హౌస్ సర్జన్, కాకినాడ




నిరసనలపై ఉక్కుపాదం


పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిరసనలు, నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతోంది. తమ సొంత రాష్ట్రంలో వైద్యురాలిగా ఎంతో ఉన్నత భవిష్యత్తు ఉన్న ఓ ఆడపిల్లకి జరిగిన అన్యాయాన్ని పట్టించుకోకుండా నిందితుల కొమ్ముకాస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ట్రైనీ వైద్యురాలి ఉదంతం దేశాన్ని కదిలించింది. అన్ని వర్గాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి. ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసనల బాటపట్టాయి. మంగళవారం నాటి నిరసనలను మమత ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణగదొక్కింది. నిరసనకారులపై వాటర్ క్యాన్లు ప్రయోగించి అడ్డుకునే ప్రయత్నం చేసింది. సంఘం పిలుపు మేరకు మృతురాలికి న్యాయం జరిగి, నిందితులకు కఠిన శిక్ష పడే వరకు ఎంతైనా పోరాడుతాం.

– డాక్టర్ ఉత్పల, వైస్ ప్రెసిడెంట్, ఆర్ఎంసీ–జూడా

యానాం రీజెన్సీ తరలిపోనుందా?

- పల్నాడు వైపు సిరామిక్స్ చూపు
- పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతిబంధకాలు
- రెండు నెలల్లో ప్రారంభం కావాల్సిన ప్లాంట్
- ట్రైల్ రన్ సక్సెస్... ఇంతలోనే తరలింపు ఏమిటి?
- పోరాటం తప్పదంటున్న కార్మికులు



యానాంలో రీజెన్సీ ప్లాంట్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పాండిచ్చేరి కేంద్రపాలిత యానాం రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ పల్నాడుకు తరలిపోనుందనే వార్తలు వినబడుతుండడంతో ఇక్కడి కార్మికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం లాకౌట్ దశలో ఉన్న ఈ పరిశ్రమ తిరిగి పునఃప్రారంభం కాబోతుందనే ఆనందంలో ఉన్న కార్మికులకు.. ఈ వార్తతో నెత్తిన పిడుగుపడినట్లయ్యింది. ఈ పరిశ్రమ పూర్వపరాల్లోకి వెళితే.. 1980లో సుమారు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో జీఎన్ నాయుడు తదితరులు కలిసి ఈ పరిశ్రమ ఏర్పాటు చేశారు. అనతి కాలంలోనే దేశవ్యాప్తంగా పేరు సంపాదించింది.

1986–87 వరకు సిరామిక్స్ టైల్స్‌ను భారతదేశంతో పాటు ఇటలీ తదితర యూరప్ దేశాలకు సైతం ఎగుమతిచేసే వారు. ఒకప్పుడు యానాం, ఆంధ్రా పరిసర ప్రాంతాల్లో సుమారు 10వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన రీజెన్సీ పరిశ్రమలో తలెత్తిన కార్మిక వివాదం చినికిచినికి గాలివానగా మారి చివరకు విధ్వంసానికి దారితీసింది. నాటి ఘర్షణల్లో ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ ఇంటిపై దాడిచేసి హత్య చేశారు. ఆ విధ్వంసంతో ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించి దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది. ఈ ఘర్షణల్లో సుమారు 60 మందిపై సీబీఐ కేసులు నమోదు చేసింది. ఈ పరిణామాలతో యాజమాన్యం ఫ్యాక్టరీని లాక్‌అవుట్ చేసింది. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారు.

అనుమతులు రాక తరలింపు యోచన..

12 ఏళ్ల తరువాత రీజెన్సీ యాజమాన్యం యానాంలో పరిశ్రమను పునరుద్ధరించేందుకు ముందుకొచ్చింది. వచ్చే అక్టోబర్‌లో తొలి విడత రూ.70 కోట్ల పెట్టుబడితో 7,000 చదరపు మీటర్ల సామర్థ్యంతో ఒక లైన్, మలి విడతలో 2025 మార్చి నాటికి నాలుగు లైన్లను అందుబాటులోకి తెచ్చి మూడింతల ఉత్పత్తిని తీసుకురావాలని యాజమాన్యం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ విషయాన్ని రీజెన్సీ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యేంద్రప్రసాద్ ధ్రువీకరించారు. ఇందుకు అనుగుణంగా ఫ్యాక్టరీని తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల ప్లాంట్‌లో అంతర్గతంగా ట్రైల్ రన్ కూడా నిర్వహించారు. పరిశ్రమ పునరుద్ధరిస్తే ఉపాధి లభిస్తుందని ఎదురుచూసిన కార్మికుల సంతోషం ఎంతోసేపు నిలువలేదు. కేంద్ర పాలిత పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి కొన్ని అనుమతుల విషయంలో ఏర్పడ్డ ప్రతిష్టంభన ప్లాంట్‌ను పల్నాడుకు తరలించాలనే ఆలోచనకు దారితీసిందంటున్నారు. యానాంలో పునరుద్ధ రించాలనుకున్న ప్లాంట్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గం బల్లికురువ మండలం వేమవరానికి తరలించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. వేమవరంలో 25 ఎకరాల్లో ఫ్యాక్టరీ ఏర్పాటుకు మొగ్గు చూపుతోంది. దీనిలో భాగంగా ప్లాంట్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులను వేమవరం ప్లాంట్ వెళ్లేందుకు సంసిద్ధత తెలియచేయాలని యాజమాన్యం కోరడంతో ప్లాంట్ తరలిపోతుందనే అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. ప్లాంట్ తరలిపోకుండా యానాంలోనే కొనసాగేలా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రీజెన్సీ యానాంలో ఉంటుందా లేక పల్నాడుకు తరలిపోతుందో వేచి చూడాల్సి ఉంది.

తరలిపోకుండా కృషి చేస్తా..


యానాం రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ పునరుద్ధరణకు పూర్తి సహాయాన్ని అందిస్తున్నాను. యానాంలోనే పరిశ్రమ ఉండే విధంగా పుదుచ్చేరి ప్రభుత్వంతో మాట్లాడతాను. ఎమ్మెల్యే అయిన దగ్గర నుంచి ప్రభుత్వం నుంచి యాజమాన్యానికి చేయూత అందిస్తున్నాను. పునరుద్ధరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్లాంట్‌లో పనులు పూర్తిచేశారు.

– గొల్లపల్లి శ్రీనివాస అశోక్, ఎమ్మెల్యే, యానాం

పోరాటాలకు వెనుకాడం..


రీజెన్సీ పరిశ్రమను యానాంలో స్థాపించినప్పుడు వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది కార్మికులతో పాటు స్థానికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా 10వేల మంది ఉపాధి పొందారు. పరిశ్రమను ఇతర ప్రదేశాలకు తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటాం. ఎటువంటి పోరాటాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారు.

– సబ్బతి శ్రీనివాస్, స్థానికుడు, యానాం

యాజమాన్యం పునరాలోచించాలి


రీజెన్సీ పరిశ్రమ ఏర్పాటుతో యా నాం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందింది. ఫ్యాక్టరీతో వేలాదిమంది కార్మికులకు ఉద్యోగాలు కల్పించింది. రీజెన్సీ టైల్స్ పరిశ్రమ ప్రపంచస్థాయి గుర్తింపు పొందడంతో యానాంకు సైతం గుర్తింపు లభించింది. ఫ్యాక్ట రీ తరలించాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలి.

– మందపాక సత్తిబాబు, సామాజిక కార్యకర్త, యానాం

క్రీడా ప్రతిభా పురస్కారాలకు ఐదు పాఠశాలలు ఎంపిక
రాయవరం: ఈ నెల 29న క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా అవార్డులకు జిల్లాలో ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం తుది జాబితాను రాష్ట్ర స్థాయికి పంపించారు. రాష్ట్ర స్థాయి క్రీడా ప్రతిభా అవార్డులు–2024కు మన జిల్లా నుంచి చోటు దక్కలేదు. జిల్లాలో తొమ్మిది పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా, జిల్లా స్థాయిలో ఆత్రేయపురం మండలం లొల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల 209 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలవగా, మలికిపురం మండలం గుడిమెల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల 158 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. 151 పాయింట్లతో రాజోలు మండలం చింతలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మూడో స్థానాన్ని, 138 పాయింట్లతో మలికిపురం మండలం బట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాల నాలుగో స్థానం, 128 పాయింట్లతో రాజోలు మండలం పొన్నమండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఐదో స్థానంలో నిలిచాయి. గురువారం కలెక్టర్, డీఈఓ ద్వారా పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికతోపాటు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అడబాల విజయశ్రీనివాస్ తెలిపారు.

అలైన్‌మెంట్ సమస్యలకు ప్రత్యేక బృందాలు

కలెక్టర్ మహేష్‌కుమార్



కోటిపల్లి రైల్వేలైన్ అలైన్మెంట్‌పై మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించేందుకు అలైన్‌మెంట్ ఉన్న గ్రామాల అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గౌతమి వైనతేయ వశిష్ట నదులపై వంతెన నిర్మాణాలపై ముందుకు వెళ్లాలని సూచించారు. కోటిపల్లి–మాగాం వరకు అలైన్‌మెంట్‌లో ఉన్న భూమిని డిసెంబర్ చివరి నాటికి రైల్వే అధికారులకు అప్పగిస్తామని, ఈ మేరకు ఆ శాఖ టెండర్ పనులు మొదలు పెట్టాలన్నారు. అమలాపురం నుంచి రాజోలు వరకు ప్రస్తుత అలైన్‌మెంట్ ఉన్న గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, గ్రామ సర్వేయర్, వ్యవసాయ సహాయకులు, ఇతర సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందితో గ్రామానికి బృందాన్ని నియమించి అక్కడి సమస్యలను గుర్తించి 14 రోజుల్లో నివేదించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ టి.నిశాంతి, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ సీఈవో పీవీవీ సత్యనారాయణ, ఆర్డీవోలు జి.కేశవవర్ధన్ రెడ్డి, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు

డ్రోన్ సాంకేతికత ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో డ్రోన్ సాంకేతికతపై జిల్లాలోని గ్రామ సర్వేయర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ విధానం వల్ల కూలీల కొరతను అధిగమించవచ్చని, పురుగు, కలుపు మందుల పిచికారి, ఎరువులు, విత్తనాలు, వెదజల్లడం వంటివి సులభంగా కచ్చితత్వంతో అతి తక్కువ సమయంలో చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డ్రోన్ ట్రైనర్ లీర్తి, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

1న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక
అన్నవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ బాల బాలికల ఎంపికలు సెప్టెంబర్ ఒకటో తేదీ ఉదయం స్థానిక సత్యదేవ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముప్పన వీర్రాజు, కార్యదర్శులు ముప్పన వీరభద్రస్వామి, వీ సీతాపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి రెండో తేదీ, 2009 సంవత్సరం తరువాత పుట్టినవారు ఈ ఎంపికల్లో పాల్గొనడానికి అర్హులు అని తెలిపారు. బాల బాలికలు ఆధార్ కార్డులు, స్టడీ సర్టిఫికెట్‌లు, డ్రెస్ కోడ్‌తో హాజరవ్వాలని కోరారు. వివరాలకు 99499 59951, 80082 66003 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అన్న క్యాంటీన్ శకటానికి రూ.2.85 లక్షలా?
కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ నిలదీత

అమలాపురం టౌన్: స్వాతంత్య్ర వేడుకలకు మున్సిపాలిటీ ప్రగతి రథం పేరుతో రూపొందించిన అన్న క్యాంటీన్ శకటానికి రూ.2.85 లక్షలు ఖర్చు అయిందా..? ఎందుకంత అయ్యిందో లెక్క చూపే వరకు అజెండాలోని ఈ అంశాన్ని ఆమోదించేది లేదని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ శకటం రూపకల్పనలో మున్సిపల్ ఇంజినీర్లు వేసిన అధిక అంచనాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఇంజినీర్ సరైన సమాధానం చెప్పకపోవడంతో కమిషనర్, డీఈఈ ఈ సమావేశానికి ఎందుకు రాలేదని ప్రశ్నిస్తూ.. సెలవుపెట్టారా? ఎవరినైనా ఇన్‌చార్జిగా పంపారా అంటూ సరైన సమాధానం రాకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

15న ఫ్రీ టెక్నికల్ పరీక్షలు
కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మరుగుదొడ్ల ఫొటోలకు సంబంధించి బాధ్యత వహించాలంటున్న నిబంధన తొలగించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావుకు యూటీఎఫ్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దుచేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం మూడు నుంచి మూడున్నర గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులు అప్లోడ్ చేయాలనడం భావ్యం కాదన్నారు. ఎస్ఎంసీ సభ్యులు, సచివాలయ అసిస్టెంట్ మరుగుదొడ్ల ఫొటోలు తీయకపోతే ఉపాధ్యాయుల బాధ్యత వహించాలనడం సరికాదన్నారు. మరుగుదొడ్ల ఫొటోలు బాధ్యత తగ్గిందని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని మోపుతూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు సహాధ్యక్షురాలు ఎం.విజయ గౌరీ పాల్గొన్నారు.

ఆహారం.. హాలాహలం

- కలుషిత ఆహారం తిన్న విద్యార్థినులకు అస్వస్థత
- ఏలేశ్వరం గురుకుల పాఠశాలలో 72 మందికి వాంతులు, విరేచనాలు
- ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు



ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఏలేశ్వరం: విద్యార్థినులు ప్రతిరోజూ లాగే ఉదయం లేచి అల్పాహారం స్వీకరించారు. తరగతులకు హాజరయ్యేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కడుపునొప్పి వచ్చింది. దీంతో పాటు వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. ఒక్కసారిగా కూలబడిపోయారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తక్షణమే వైద్యసిబ్బంది అప్రమత్తమై వైద్యసేవలు ప్రారంభించడంతో ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో మంగళవారం ఫుడ్ పాయిజన్ కావడంతో 72 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మొత్తం 625 మంది విద్యార్థులు ఉండగా వారితో కొందరు అస్వస్థత గురయ్యారు. వీరిని స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండు రోజులుగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం కలుషితం కావడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. ఆదివారం రాత్రి గోంగూర, వంకాయతో కలిపి వండిన కూరను, సోమవారం రాత్రి పచ్చిశెనగపప్పు, కాలేజితో కలిపి వండిన కూర తిన్న విద్యార్థినులకు పెట్టారు. అప్పటి నుంచి విద్యార్థినులు అస్వస్థతకు గురైనా నిర్వాహకులు పట్టించుకోలేదని తల్లిదండ్రులు, విద్యార్థులు చెబుతున్నారు.

బాగా నీరసంగా ఉంది


వాంతులు, విరేచనాలు కావడంతో బాగా నీరసంగా ఉంది. ఉదయం టిఫిన్ చేసినప్పటి నుంచి అస్వస్థతకు గురయ్యాను. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాను.

– బర్రె చాందిని, 8వ తరగతి విద్యార్థిని

పిల్లలను ఇంటికి పంపించాలి


పిల్లలను ప్రస్తుతం పాఠశాలలో ఉంచాలంటే భయంగా ఉంది. వెంటనే పిల్లలను ఇంటికి పంపించాలి. కొద్దిరోజుల తరువాత తిరిగి పాఠశాలకు పంపుతాం.

– మాతే దుర్గాప్రసాద్, విద్యార్థిని తండ్రి

మెరుగైన చికిత్స అందిస్తున్నాం


విద్యార్థినుల పరిస్థితి అదుపులోనే ఉంది. వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నాం. విద్యార్థినులకు ఆరోగ్యం బాగానే ఉంది.

– ఎస్ స్వప్న, డీసీహెచ్ఎస్, కాకినాడ

వసతులు మెరుగు పరచాలి


పాఠశాలలో వసతులు మెరుగు పరచాలి. వంటశాల, భోజనశాల మెరుగు పరచాలి. విద్యార్థులకు అందించే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విద్యార్థులకు ఏమి జరిగినా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి.

–కొశిరెడ్డి గణేష్, సీపీఐ (ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి

రాత్రి అస్వస్థతకు గురయ్యాను


రాత్రి భోజనం చేశాక ఒక్కసారిగా వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. పాఠశాలలో మందులు ఇచ్చారు. ఉదయం నుంచి ఎక్కువ కావడంతో ఆసుపత్రిలో చేర్చారు.

–పెడిద సారా, పదో తరగతి విద్యార్థిని

వంటశాల అధ్వానంగా ఉంది


పాఠశాలలో వంటశాల అధ్వానంగా ఉంది. వంటశాల వద్ద అపరిశుభ్రత నెలకొంది. శుభ్రత లోపించడంతోనే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

– మోరంపూడి వెంకన్న, విద్యార్థిని తండ్రి

వెంటనే ఆసుపత్రిలో చేర్చాం


విద్యార్థినులు అస్వస్థతకు గురైన వెంటనే ఆసుపత్రిలో చేర్చాం. వారికి మెరుగైన చికిత్స అందుతోంది. విద్యార్థినులను ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉంటాం.

చంద్రశారదా, ప్రిన్సిపాల్ గురుకుల పాఠశాల

క్లుప్తంగా

దివ్యాంగ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కోర్టు అధికారుల ఒత్తిడి తట్టుకోలేకేనని వెల్లడి



సుంకర సత్యనారాయణ

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం కోర్టులో అటెండర్‌గా పనిచేస్తున్న సుంకర సత్యనారాయణ అనే దివ్యాంగ ఉద్యోగి (అంధుడు) ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుడైన బాధితుడు పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాను పని చేసే కార్యాలయంలో అధికారుల నుంచి ఒత్తిడి తట్టుకోలేక తాను శుక్రవారం చీమలమందు తాగి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు బాధితుడు తెలిపారు. దీనిపై పిఠాపురం పట్టణ పోలీసులను వివరాలు అడగ్గా... విషయం తెలుసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేశామని ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు. బాధితుడిని 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు మంగళవారం పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈనెల 29న ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు. బాలురకు 10 వెయిట్ కేటగిరీల్లో, బాలికలకు 10 వెయిట్ కేటగిరీల్లో డీఎస్‌ఏ వెయిట్ లిఫ్టింగ్‌కోచ్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 56 మంది బాలికలు, 16 మంది బాలురు పాల్గొన్నారు. విజేతలకు 29న బహుమతులు అందజేస్తామని డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ పురస్కారాలు

ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా అమరావతిలోని పాఠశాల విద్యా సంచాలకుడు కాకినాడ జిల్లాలో 5 పాఠశాలలు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌కు ఎంపిక చేశారని డీఈఓ రమేష్ మంగళవారం తెలిపారు. కాకినాడ జిల్లాలో కాకినాడ రూరల్ గుడారిగుంట ఎంటీఎంసీ హైస్కూల్, వాకలపూడి జెడ్పీ హైస్కూల్, కరప జెడ్పీ హైస్కూల్, గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్, గురజనాపల్లి జెడ్పీ హైస్కూళ్లు ఈ ఏడాది ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యాయన్నారు. వీరికి గురువారం అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

రెండు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్



పోలీసు స్టేషన్ వద్ద ఉంచిన ట్రాక్టర్లు, జేసీబీ

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అంతర్వేది కర వద్ద సముద్ర తీరంలో మంగళవారం రాత్రి ఇసుక అక్రమంగా తవ్వుతూ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, ఒక జేసీబీని పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు వీటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనిపై తగు చర్యలు నిమిత్తం ముమ్మిడివరంలోని గనులు, భూగర్భ శాఖకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్‌కు నివేదిక పంపినట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు.



శిక్షలు కఠినంగా ఉండాలి

ఇటీవలి కాలంలో విచ్చలవిడితనం బాగా పెరిగిపోయింది. పిల్లలపై పెద్దల నియంత్రణ లేదు. దీంతో ఎన్నో రకాల దుర్వ్యసనాలకు లోనవుతున్నారు. ఒంటరిగా మహిళలు తిరగడం అనేది తప్పు అంటున్నారే కానీ వారు పనిచేసే ప్రాంతంలో స్వాతంత్ర్యం కూడా లేకుండా, ఎటువంటి భరోసా లేకుండా ఉండడం దారుణమైనది. చిన్ననాటి నుంచే విలువలు నేర్పిస్తే ఇలా జీవితంలో బాధపడే రోజులు రావు. కోల్‌కతా వంటి ఘటనలు మళ్లీ జరగకుండా శిక్షలు ఉండాలి.

– డాక్టర్ అంజలి, సైకియాట్రిస్ట్, రాజమహేంద్రవరం



భద్రతా చర్యలు చేపట్టాలి

వైద్యుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. పనిచేస్తున్న చోట ప్రతి మహిళా వైద్య సిబ్బందికి తాము భద్రతలో ఉన్నామన్న ధైర్యం ఉండాలి. అప్పుడే వైద్యులు భయం లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందించ గలుగుతారు. దీనికోసం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి.

– డాక్టర్ ఈశ్వర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గాడిమొగ



రక్షణ కల్పించావా దేవా..

- ఆదిశంకర మార్గ్‌కు పటిష్టమైన రక్షణ
- అల్యూమినియం స్తంభాలు, రేకులతో భద్రత

సాక్షి ఎఫెక్ట్

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్మించిన 'ఆదిశంకర మార్గ్' రహదారికి ఎట్టకేలకు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. ఈ రహదారికి ఎడమ వైపు లోయలోకి వాహనాలు పడిపోకుండా పటిష్టమైన బారికేడ్లు నిర్మించారు. గతంలో ఈ రోడ్డు చివర పుచ్చిపోయిన సర్వే కర్రలు పాతి వాటి మధ్య డేంజర్ అని రాసి ఉన్న రిబ్బన్ కట్టారు. మనిషి చెయ్యి వేస్తేనే పడిపోయే ఆ కర్రలు వాహనాలు పడిపోకుండా ఎలా కాపాడతాయనే విషయమై సాక్షి దినపత్రికలో గత నెల వ తేదీన 'ఇదేమి రక్షణ సత్యదేవా..?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు అగమేఘాలపై బారికేడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డుకు ఎడమవైపు లోయవైపు అంచున ఇనుప స్తంభాలు పాతి వాటి మధ్య అల్యూమినియం రేకుతో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ఆదిశంకర్ మార్గ్ ఎంతో ఉపయోగం

సీఆర్వో కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్ (దిగువకు వెళ్లే ఘాట్‌రోడ్) మూడో మలుపు వరకు ఆదిశంకర మార్గ్ పేరుతో గత ఏడాది నిర్మించిన ఈ రహదారి భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. దేవస్థానానికి వివిధ వాహనాలపై వచ్చే భక్తులు తిరిగి వెళ్లే సమయంలో తరచూ ట్రాఫిక్ అంతరాయాలతో ఇబ్బంది పడేవారు. కార్తీకమాసం, తదితర పర్వదినాల్లో వేల సంఖ్యలో వాహనాలలో భక్తులు కొండ దిగువకు రావడానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది.

గత ఏడాది అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ సత్యగిరి దిగువన గల సీఆర్వో కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్ (దిగువకు వెళ్లే ఘాట్ రోడ్) మూడో మలుపు వరకు 'ఆదిశంకర మార్గ్' పేరుతో రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు ద్వారా సత్యగిరి సత్రాలలో బస చేసే భక్తులు, సత్యగిరి పార్కింగ్ స్థలంలో, ప్రకాష్‌సదన్ వెనుక పార్క్ చేసిన భక్తుల వాహనాలు నేరుగా దిగువకు వెళ్లే అవకాశం ఏర్పడింది. అయితే ఈ రోడ్డుకు ఎడమవైపున సుమారు 50 అడుగుల లోయ ఉండడంతో అటువైపు వాహనాలు పడిపోకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ ఈఓ నవంబర్‌లో కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ తరువాత ఈ రోడ్డు మీద పెద్దగా దృష్టి పెట్టిన దాఖలా లేదు. తాజాగా సాక్షి కథనంతో అధికారులు స్పందించి ఈసారి పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేశారు.



ఆదిశంకర మార్గ్‌లో లోయ వైపు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (అంతర చిత్రం) గత నెల 28న సాక్షిలో ప్రచురితమైన కథనం

నగల వ్యాపారి ఇంట్లో చోరీ

- 50 కాసుల ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణ
- వెళ్లేటప్పుడు స్కూటర్ సైతం చోరీ
- మరో మూడు ఇళ్లల్లోనూ యత్నం
- చేసింది ఒకరేనా? ముఠానా అనే అనుమానం
- సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడి చిత్రం



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు: పట్టణంలో కట్టా ఉషాశ్రీ అనే నగల వ్యాపారి ఇంట్లో దొంగలు చోరీకి తెగబడ్డారు. సుమారు రూ.30 లక్షల విలువైన యాభై కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్, యాక్టివా స్కూటర్‌ను ఆపహరించుకుని పోయారు. పట్టణంలో మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో సోమవారం రాత్రి దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారు. వరుసగా మూడు వీధుల్లో చోరీ యత్నానికి పాల్పడడం, ఇందిరమ్మ కాలనీలో బయట పార్క్ చేసిన బజాజ్ డిస్కవరీ మోటారు సైకిల్‌ను మరో దొంగ అపహరించుకుని పోవడంతో పట్టణ వాసులు తీవ్ర భయాందోళనకు లోనవతున్నారు. వివరాల్లోకి వెళితే పట్టణంలో మసీదు వీధిలో ఉషాశ్రీ జ్యూయలరీ పేరుతో కట్టా ఉషాశ్రీ బంగారు ఆభరణాల దుకాణం నడుపుతున్నారు. సోమవారం రాత్రి దుకాణం మూసి వేసిన తర్వాత ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో మహ్మద్ మహారాజ్ అపార్టుమెంటులోని ఆమె నివాసానికి వచ్చి నిద్రిస్తున్నారు. ఆ సమయంలో అపార్టుమెంటుకు వెనుక ఉన్న భవనం పైనుంచి వెనుక వైపు తలుపు నుంచి అర్ధరాత్రి దొంగలు లోపలికి ప్రవేశించారు. పడక గదిలో భార్య, భర్తలు నిద్రిస్తుండగానే అదే గదిలో అక్కడే ఉన్న బీరువా తెరచి బంగారు ఆభరణాలు అపహరించుకు పోయారు. రెండు హారాలు, నాలుగు నెక్లెస్‌లు, కమ్మలు యాభై జతలు, ఉంగరాలు పదిహేను, చైన్లు రెండు, పులిగోరు ఒకటి, పట్టీ ఒక జత, చెంప సవరాలు ఒక జత, ముత్యాల దండ ఒకటి, పాపిడి బొట్టు ఒకటి, గాజులు ఒక జత, డాలర్ ఒకటి ఇలా 400 గ్రాముల ఆభరణాలు చోరీకి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటితో పాటు రూ.2 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్ తీసుకుని మెయిన్ రోడ్డు నుంచే వెళ్లి అపార్టుమెంటు కింద పార్క్ చేసిన యాక్టివా మోటారు సైకిల్ అపహరించారు. అన్నీ ఆభరణాలు కలిపి మార్కెట్ ధర ప్రకారం రూ.30 లక్షల విలువ ఉంటుందని అంచనా. పోలీసులు మాత్రం వీటి విలువ సుమారు రూ.17.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. డీఎస్పీ జి.దేవకుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీఐ పి.విశ్వం ఈ ఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నారు. డాగ్ స్వ్కాడ్, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించారు. వేలిముద్రలు ఆధారంగా నిందుతుడ్ని గుర్తించినట్లు సమాచారం. ఇళ్లలో చోరీకి పాల్పడే రాజమహేంద్రవరానికి చెందిన వ్యక్తిగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. నిందుతుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.



ఆభరణాల చోరీకి గురైన బీరువా ఇదే



చోరీ యత్నంలో అలికిడి కావడంతో పారిపోతూ సీసీ కెమెరాకి చిక్కిన నిందితుడి చిత్రం



ఘటన స్థలంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

మూడు వీధుల్లో చోరీకి యత్నం

ఒకేరోజు రాత్రి వరుసగా మూడు వీధుల్లో మూడు ఇళ్లల్లో చోరీకి యత్నించడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. తొలుత అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వీధిలో బొప్పన వెంకట్రావు ఇంటి వద్ద దొంగతనానికి వెళ్లి మెష్ కట్ చేస్తుండగా అలికిడి కావడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ దృశ్యాలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. అనంతరం నాళం వారి వీధిలో పై అంతస్తులో తాళం వేసి ఉన్న కణతం కృష్ణవేణికి చెందిన ఇంట్లోకి చొరబడి ఇంటి తాళాలు, బీరువాలోని చీరలు, దుస్తులు చెల్లాచెదరు చేశారు. ఇక్కడ ఏం పోయాయన్నది తెలియాల్సి ఉంది. అలాగే ఈ వీధి పక్కనే ఉన్న కొక్కిరిమట్ల శ్రీనివాస్ ఇంటి గోడ దూకి స్కూటర్ నుంచి దిగినట్టు ఆనవాళ్లు కనిపించాయి. అక్కడ చోరీకి అనువుగా లేకపోవడంతో వెళ్లిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. అనంతరం ఐసీఐసీఐ బ్యాంకు వీధిలోని అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడ్డారు. కాగా ఇన్ని దొంగతనాలకు యత్నించినది ఒకరేనా, ఏదైనా ముఠానా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీధి లైట్లు సక్రమంగా వెలగక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వనరుల సద్వినియోగంతో సుస్థిరాభివృద్ధి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్
- 11 జిల్లాల అధికారులకు ఈటీసీలో శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీఆర్‌అండ్ ఆర్డీ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రగతి సాధ్యపడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ఈటీసీలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఆయన శిక్షణను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 9 లక్ష్యాలపై మంగళవారం నుంచి మూడు రోజుల పాటు 'స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాల గల గ్రామం' అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. సౌకర్యవంతమైన ఇళ్లు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, డ్రైనేజీ, వీధిలైట్లు తదితర అంశాలను ఆయన వివరించారు. ప్రస్తుత ఆరో బ్యాచ్ శిక్షణ గురువారంతో ముగుస్తుందన్నారు. ఫ్యాకల్టీలు జీవీఎస్ శ్రీదేవి, కేఆర్ నిహారిక, డీఆర్ఎస్ పద్మజ, ఎం.చక్రపాణిరావు బి.వెంకటేశ్వర్లు, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు, పి.శ్రీనివాసరావు శిక్షణా తరగతులు నిర్వహించారు.

ప్రాణ, వృక్ష రక్షణపై యువకుడి సైకిల్ సందేశం



అమలాపురానికి వచ్చిన సుప్రియ దాసు వోల్గా

అమలాపురం టౌన్: సేఫ్ డ్రైవ్.. సేఫ్ లైఫ్...సేఫ్ ట్రీ ఈ మూడు నినాదాలతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువకుడు సుప్రియ దాసు వోల్గా దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్నాడు. తన యాత్రలో భాగంగా సోమవారం రాత్రి అతడు అమలాపురంలో బస చేశాడు. పట్టణ వైఎస్సార్ సీపీ నాయకుడు గనిశెట్టి రమణలాల్‌కు చెందిన రెసిడెన్సీలో బస చేశాడు. మంగళవారం ఉదయం మళ్లీ యాత్రను ప్రారంభించాడు. ఇక్కడ నుంచి నర్సాపురంతో పాటు కోస్తా జిల్లాల మీదుగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తన యాత్ర చేరుకుంటుందని వోల్గా తెలిపాడు. ఇదే నినాదంతో తొలి విడతగా 19 వేల కిలోమీటర్ల మేర పలు రాష్ట్రాల్లో తన సైకిల్ యాత్ర పూర్తి చేశాడు. ఇప్పుడు రెండో విడత యాత్ర మొదలు పట్టి కేరళలో యాత్రను ముగించనున్నట్లు చెప్పారు. దేశంలో ఎవరైనా ఏ వాహనాన్నైనా సురక్షితంగా నడిపితే ప్రమాదాలు, ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని, అలాగే ప్రతి ఒక్కరూ వృక్షాలను రక్షిస్తే అవే మనల్ని తిరిగి రక్షిస్తాయన్న నినాదంతో వోల్గా ముందుకు సాగుతున్నాడు. తన సైకిల్‌పై యాత్ర ముఖ్య ఉద్దేశం, నినాదాన్ని పేర్కొంటూ బోర్డు, తన వసతికి సంబంధించిన బ్యాగ్‌తో మాత్రమే యాత్ర నిర్వహిస్తున్నాడు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి



మృతుడు సత్యనారాయణ

ఏలేశ్వరం: మండలంలోని తూర్పుల క్రీపురం గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సగరపు సత్యనారాయణ (34) పామాయిల్ తోటలో గెలలు నరికి ఇంటికి వెళుతుండగా కత్తి విద్యుత్ తీగలకు తగలడంతో మృతి చెందాడు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిర్లంపూడి: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు గెద్దనాపల్లి గ్రామానికి చెందిన కొత్త నగేష్ అదే గ్రామంలో దుకాణాన్ని అద్దెకు తీసుకుని కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం దుకాణం తెరవడానికి వెళ్లాడు. షాపులో ఉన్న ఫ్రిడ్జ్‌కు కరెంట్ తీగలు షార్టు సర్క్యూట్ కావడంతో దానిని తాకిన నగేష్ అక్కడే పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అది గమనించిన స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య కొత్త సూర్య సుజాత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై భాను ప్రసాద్

ఐ.పోలవరం: మండలంలో మురమళ్ల-కేశనకుర్రు రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం కేశనకుర్రు గ్రామానికి చెందిన గాదిరాజు రాజంరాజు (65) ముమ్మిడివరంలో నివాసముంటున్న తన కుమార్తె ఇంటికి మోటారు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా కొత్త మురమళ్ల సమీపంలో వెనుక నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొని వెళ్లిపోతుండగా స్థానికులు వెంబడించి వాహనాన్ని పట్టుకున్నారు. ఈ ఘటనలో రాజంరాజు వ్యాన్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారాన్ని స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు అందజేశారు. దీనితో ఎస్సై జె.భానుప్రసాద్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు నిర్వహించి ప్రమాదానికి కారణమైన బొలేరో వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో పలు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, 12 మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు, 12 మందికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ఎస్‌హెచ్‌వోలు కృషి చేయాలని డీఎస్పీలు ఈ అంశాన్ని పర్యవేక్షించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, అక్రమ మద్యం, గంజాయి నిర్మూలన అంశాలపై మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు భాస్కరరావు, శ్రీలక్ష్మి, డీఎస్పీలు రఘువీర్, లతాకుమారితో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కువైట్ నుంచి విముక్తి కలిగించండి

భారత దేశానికి తీసుకువెళ్లాలని ప్రత్తిపాడు మహిళ వీడియో సందేశం



కువైట్ నుంచి వీడియో సందేశం విడుదల చేసిన నాగమణి

ప్రత్తిపాడు రూరల్: తనను కాపాడి భారత్‌కు తీసుకురావాలని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన చింతపల్లి నాగమణి మంగళవారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ వీడియో స్థానికంగా వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నలుగురు సభ్యులు కలిగిన తన కుటుంబాన్ని పోషించుకోవడానికి కువైట్ వెళ్లినట్లు తెలిపారు. ఇటీవల తన ఆరోగ్యం బాగా క్షీణించిందన్నారు. తన నోరు, ముక్కు నుంచి రక్తస్రావం అవుతోందని, కావున ప్రభుత్వం తక్షణం స్పందించి తనను స్వస్థలానికి తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని ఆమె కోరింది. తనను మంత్రి లోకేష్ ఆదుకోవాలని లేకుంటే మరణమే శరణమని వీడియో సందేశాన్ని పంపారు. ఆమె భర్త నాగేశ్వరరావు, కుమార్తెలు విమల, అమృత ఈ వీడియోపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆమెను దేశానికి రప్పించి తమను ఆదుకోవాలని వారు వేడుకున్నారు.